పనులను వేగంగా పూర్తిచేయాలి


నగరంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరందు, ఎమ్మెల్యే ధన్‌పాల్


ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్ మకరందు

- మున్సిపల్ కమిషనర్ మకరందు
- నగరంలో పర్యటన

నిజామాబాద్ అర్బన్: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ మందమకరందు అన్నారు. నగరంలో మంగళవారం ఆయన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దేవీ థియేటర్ సమీపంలోని స్మశాన వాటికను పరిశీలించారు. కంఠేశ్వర్‌లోని పలు కాలనీలను తనిఖీ చేశారు. రోడ్లను, డ్రెయినేజీలను శుభ్రపరచడం వంటి పనులు ఎలా జరుగుతున్నాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఓ ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీని పరిశీలించి, తక్షణమే దానికి పైకప్పు వేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

ఓటర్ జాబితా పకడ్బందీగా తయారు చేయాలి..
అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ మకరందు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఓటర్ జాబితా తయారీ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు ఉండకూడదన్నారు. ఆయా డివిజన్‌లు, కాలనీల వారీగా ఓటర్ల జాబితా సక్రమంగా ఉండాలన్నారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అన్ని ఆధారాలను తనిఖీ చేసిన తర్వాతనే జాబితాలో నమోదు చేయాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన..
నగరంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ మకరందు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు సమీపంలోని ఒక లేఅవుట్‌లో దరఖాస్తుదారుడి వివరాలను పరిశీలించి, లేఅవుట్ ప్లాటును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ అధికారిణి అనుపమ, ఆర్‌ఐ ప్రభాకర్, ఇంజినీర్ నర్సయ్య తదితరులు ఉన్నారు.

రుణమాఫీ సంబురాలు సిగ్గుచేటు

- బ్యాంకుల ఎదుట అన్నదాతలు ధర్నా చేసే పరిస్థితి
- గ్యారంటీలు, డిక్లరేషన్లను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పాల్గొన్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేసిందని కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేయడం సిగ్గుచేటని, రుణమాఫీ కాని రైతులు కన్నీళ్లు పెడుతూ బ్యాంకుల ఎదుట ధర్నాలు చేసే పరిస్థితి నెలకొందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు.నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 5 డిక్లరేషన్లు ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటి అమలును పూర్తిగా విస్మరించిందన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన రుణమాఫీ, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, రైతుబీమా, పంట బోనస్ హామీలకు అతీగతీ లేకుండా పోయిందన్నారు. రుణమాఫీకి రూ.31వేల కోట్లు అవుతుందని అంచనా వేసి, కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వెచ్చించి చేతులు దులుపుకుందని విమర్శించారు.ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రై తులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్‌చేశారు.జిల్లాలో 2.25లక్షల మందికిగాను కేవలం 78,748 మందికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేశారన్నారు.నాగారం బొందెం చెరువు కబ్జాదారులు, అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని.. కబ్జాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల హస్తముందని ఆరోపించారు.నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి అమాయక ప్రజలను మోసం చేశారని, వారిపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

బీజేపీ రైతు పక్షపాతి
బీజేపీ రైతు పక్షపాతి అని, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని ధన్‌పాల్ పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాలకు ఉపయోగపడేలా రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించిందని, ఫసల్‌బీమా యోజన పథకం, కిసాన్ సమ్మాన్ నిధి, ఎరువులపై సబ్సిడీ, పాడి రైతులకు 50శాతం సబ్సిడీ అమలు చేస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఎర్రం సుధీర్, నారాయణ యాదవ్, ప్రభాకర్, సాయివర్ధన్, ఇప్పకాయలకిశోర్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


నగరంలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు అన్నారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి, వినాయక్ నగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఓటు హక్కు కల్పించి, రాజకీయాలలో యువకుల పాత్ర ముఖ్యమని చెప్పిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ అసెంబ్లీ ముందు తెలంగాణతల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఇప్పుడు రాజీవ్‌గాంధీ విగ్రహం పెడితే రాద్ధంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు. విగ్రహంపై చేయి పెడితే కేటీఆర్‌ను రోడ్లపై తరిమి కొడతామని హెచ్చరించారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ, జిల్లా అధ్యక్షులు వేణురాజ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, డీసీసీ డెలిగేట్ లవంగ ప్రమోద్, వినయ్, రాజేష్, ఉష, ప్రభాకర్, నర్సింగ్, సాయికుమార్ పాల్గొన్నారు.

అన్నదాతల నుంచి దరఖాస్తుల స్వీకరణ


నడిపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు


మోపాల్‌లో ధర్నా చేస్తున్న రైతులు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి రైతువేదికలో మంగళవారం రుణమాఫీ పొందని రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అధికారులు మాట్లాడుతూ.. దరఖాస్తుల స్వీకరణ అనంతరం క్షేత్రస్థాయిలో సంబంధిత రైతుల వద్దకు వెళ్లి, పూర్తి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. రుణమాఫీ రాని రైతులు ఆందోళన చెందవద్దని అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.అధికారులు సుధా మాధురి తదితరులు ఉన్నారు.

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్‌లోని రైతు వేదిక వద్ద తహసీల్దార్ రామేశ్వర్, ఏవో సౌమ్య, ఏఈవోలు రంజిత్‌కుమార్, శరత్‌చంద్ర, భావన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈక్రమంలో రుణమాఫీ కాని పలువురు రైతులు రైతువేదిక ఎదుట ధర్నా నిర్వహించారు. అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదని, వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు సైతం రుణమాఫీ ఎందుకు కాలేదో స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని నిరసన తెలియజేశారు.

రుణమాఫీపై ఉన్నతాధికారుల సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని పాల్దా సొసైటీ పరిధిలోని 138 మంది రైతులు రుణమాఫీ కాకపోవడంతో పాల్దా సహకార సంఘానికి సోమవారం తాళం వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి శ్రీనివాస్ సొసైటీని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. సంఘం పరిధిలో తీసుకున్న రుణం రూ.50 వేలు అయితే ఆన్‌లైన్‌లో అధికారుల వద్ద ఉన్న లిస్ట్‌లో మాత్ర రూ.లక్ష చూపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీవో శ్రీనివాస్‌ను క్రాఫ్ లోన్ రుణాలు మాఫీ కాని రైతులు నిలదీశారు. స్పందించిన డీసీవో రుణాలు మాఫీ కాని రైతులు తమ క్లస్టర్ పరిధిలో ఉన్న రైతు వేదికల్లో ఉన్న వ్యవసాయ అధికారులకు వినతిపత్రాలు అందించాలని కోరారు. అర్హులకు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని డీసీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రదీప్, కో–ఆపరేటివ్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హిరా, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటర్ జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయాలి

డిచ్‌పల్లి: బీఎల్‌వోలు తమ పరిధిలోని ఓటర్ జాబితాను సక్రమంగా సిద్ధం చేయాలని తహసీల్దార్ ప్రభాకర్ సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం ఆయన బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సిబ్బంది ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి, చనిపోయిన వారి వివరాలు తొలగించాలని,అలాగే కొత్త ఓటర్ దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.ఎలాంటి తప్పులు లేకుండా జాబితాను తయారు చేయాలన్నారు.ఆయా గ్రామాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటూ, ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ సంతోష్ ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం



నిజామాబాద్‌రూరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరు కావాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును ఇస్కాన్ కేంద్రం నిర్వాహకులు కోరారు. ఈమేరకు కేంద్రం నిర్వాహకులు రామానంద ప్రభుదాస్ మంగళవారం కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 25న నగరంలోని విజయలక్ష్మి గార్డెన్స్‌లో ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకలకు నగరంలోని భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. స్వామి యాదవ్, కమలాపురి సాయిలు ప్రభు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



డిచ్‌పల్లి: గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఎల్‌ఆర్‌ఎస్ ప్రాసెస్‌కు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ సూచించారు. నడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయన కార్యదర్శులతో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షించారు. ఎంపీవో మాట్లాడుతూ.. వారం రోజులు ఎల్‌ఆర్‌ఎస్ ఎల్1 టీమ్ (సెక్రటరీ , ఎంఆర్‌ఐ, ఏఈ ఇరిగేషన్) మండలంలో అన్ని గ్రామపంచాయతీలు తిరిగి ప్రాసెస్ కంప్లీట్ చేస్తారన్నారు. దరఖాస్తుదారులు తమ పత్రాలతో కార్యదర్శులను సంప్రదించాలన్నారు. దరఖాస్తుదారులు నిర్ణీత ఫీజు చెల్లించి తమ ఎల్‌ఆర్‌ఎస్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. కార్యదర్శులు నీట్టు కిషన్ రావు, జయశ్రీ, రమేష్, వినయ్ , కారొబార్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన




నిజామాబాద్‌నాగారం: నగరంలోని హరిచరణ్ మార్వాడి జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం, సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘనపూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దోమల నియంత్రణ, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సంపత్, అధ్యాపకులు సంజీవ్, సారా, నరేష్, వినోద్, పూర్ణచందర్, వైద్య సిబ్బంది సునీత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

డిచ్‌పల్లి: మండల వ్యవసాయశాఖ అధికారిగా సుధా మాధురి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏవో రాంబాబు ఆలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సుధా మాధురి బదిలీపై వచ్చారు.

ఇందల్వాయి ఏవోగా శ్రీకాంత్


శ్రీకాంత్

ఇందల్వాయి: మండల వ్యవసాయశాఖ అధికారిగా శ్రీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ఇందల్వాయి రైతువేదికలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సంక్షిప్తం


ఇన్‌చార్జి ఎంఈవోగా సేవాలాల్
నిజామాబాద్‌అర్బన్: ధర్పల్లి, ఇందల్వాయి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా నిజామాబాద్ ఎంఈవో సేవాలాల్‌కు అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈమేరకు మంగళవారం డీఈవో దుర్గాప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్పల్లి, ఇందల్వాయి మండలాల ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి సెలవుల్లో ఉండటంతో తాత్కాలికంగా బాధ్యతలను అప్పగించారు.

ఆర్థికసాయం అందజేత



సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన సందీప్‌గౌడ్ ఇటీవల దుబాయ్‌లో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మంగళవారం దుబాయ్‌లో స్థిరపడిన శ్రీనివాస్‌గౌడ్ ఆర్థిక సహాయం చేశారు. యూఏఈ కౌండిన్య గ్రూప్ ద్వారా ఒక లక్ష ఒక వెయ్యి నాలుగు వందల రుపాయలను మృతుడి చెల్లె పెళ్లి కోసం బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశారు. అలాగే ఆయన స్నేహితులు రూ.17,500 నగదును అందించారు. మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ రవీందర్, సంతోష్‌రెడ్డి, నరహరి, సంతోష్ ఉన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నిర్మల్‌హృదయ్ పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ స్వామ్రాట్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను అందజేశారు.

సాహిత్యంతోనే సమాజం ముందుకు



నిజామాబాద్‌నాగారం: సాహిత్యం మూలంగానే సమాజం ముందుకు సాగుతుందని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. వినాయక్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సాహిత్యం లేనిదే సమాజం లేదన్నారు. సాహిత్యాన్ని గుర్తించి తెలుసుకోవాలన్నారు. తెరవే కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, నిజామాబాద్ తెరవే ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్ తదితరులున్నారు.

ట్రాఫిక్ సీఐకి సన్మానం
ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణను మంగళవారం కాంగ్రెస్ నేతలు సన్మానించారు. నగరంలోని రైల్వేకమాన్ వద్ద సోమవారం వర్షం నీటిలో చిక్కుకున్న బస్సులోని ప్రయాణికులను సీఐ సకాలంలో స్పందించి, కాపాడారు. కాంగ్రెస్ నేతలు సంతోష్, లవంగ ప్రమోద్, నరేందర్‌సింగ్, దేవారెడ్డి తదితరులు ఉన్నారు.

యువశక్తిపై అవగాహన
నిజామాబాద్‌అర్బన్: నగరంలోని స్కాలర్స్ హైస్కూల్‌లో మంగళవారం లయన్స్ సహారా ఆధ్వర్యంలో యువశక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. టి.ప్రవీన్‌కుమార్, ఉదయసూర్యభగవాన్ పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. నరసింహారావు, ధనుంజయరెడ్డి, కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షురాలిగా దీపిక


దీపిక

నిజామాబాద్‌అర్బన్: నగరంలో మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలిగా దీపికను ఎన్నుకున్నారు. నాపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన జిల్లా కమిటీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ రైతుల పక్షమే
ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు రైతుల పక్షాన ఉంటుందని, రుణమాఫీ అర్హులైన రైతులందరికీ అందుతుందని జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్‌లోని ప్రెస్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రుణమాఫీ విషయంలో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. నాయకులు చిన్నారెడ్డి, విట్ట జీవన్, చిట్టి మధు, జీవన్‌రెడ్డి, భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ
కమ్మర్‌పల్లి: మండలంలోని కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపీడీఓ రాజశ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. డెంగీ బాధితుల జాబితాను పరిశీలించారు. ఎంపీవో సదాశివ్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం
నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లోగల రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి మంగళవారం తూము సాయిలు రూ. 1,11,111లను వీడీసీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయానికి తన వంతు సేవ చేయడం ఆనందంగా ఉందని సాయిలు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

సప్తభజన ప్రారంభం



సిరికొండ: మండలంలోని లొంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సప్త భజన ప్రారంభించారు. శ్రీకృష్ణాష్టమి వరకు ఏడు రోజుల పాటు భజన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

25న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం
మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బాడ్సి గ్రామ శివాలయంలో ఈనెల 25న 108 జంటలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ దేశ్‌పాండే ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో దంపతులు, బ్రాహ్మణ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అక్రమ డిప్యుటేషన్లు ఆపాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖలో అక్రమంగా డిప్యుటేషన్లు ఇస్తున్నారని, వాటిని వెంటనే ఆపాలని ఆప్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సమీర్ అహ్మద్ కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంతును కలిసి, వినతిపత్రం అందజేశారు. అనంతరం డీఎంహెచ్‌వో రాజశ్రీకి సైతం విన్నవించారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



నిజామాబాద్‌నాగారం: నగరంలో మంగళవారం పట్టణ నాయీబ్రాహ్మణ దుకాణదారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు తిరుమల శ్రీనివాస్ ఆర్య నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా గడిల భూమేష్, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా మోతే తరుణ్, ఉపాధ్యక్షులుగా అనిల్ కుమార్, బాలస్వామి, నారాయణ ప్రమాణం చేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణ దుకాణదారుల అభ్యున్నతికి తాము ఎల్లవేళలా పాటుపడతానని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నగరంలో కరెంట్ కోత
సుభాష్‌నగర్: బోర్గాం(పి) సబ్‌స్టేషన్ పరిధిలోగల 11 కేవీ మాధవనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో కరెంట్ కోత ఉండనున్నట్లు టౌన్–3 ఏడీఏ వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. మాధవనగర్, పాంగ్రా, భూమారెడ్డి ఫంక్షన్‌హాల్, ఈస్ట్ బ్యాంక్ కాలనీల్లో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	110
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,000	వెండి (కిలో)	88,700
22 క్యారెట్స్	68,265	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	35	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	20	40
బీరకాయ	30	60	దోసకాయ	20	40
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	50	70	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	70	90	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	70			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) - 10.25, 4.30, 10.35 మిస్టర్ బచ్చన్(తెలుగు)-1.30,7.35
స్క్రీన్-2	స్త్రీ-2(హిందీ)- 10.30 తంగలాన్(తెలుగు)-1.30,7.35 ఆయ్(తెలుగు)-4.35,10.35
స్క్రీన్-3	మిస్టర్ బచ్చన్(తెలుగు)- 10.20, 10.40 డబుల్ ఇస్మార్ట్ (తెలుగు)-1.25, 7.30 స్త్రీ-2(హిందీ) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-9.00, 7.05 మిస్టర్ బచ్చన్(తెలుగు)-12.25, 10.30 స్త్రీ-2(హిందీ)-3.50
స్క్రీన్-2	మిస్టర్ బచ్చన్(తెలుగు)-9.10, 7.15 డబుల్ ఇస్మార్ట్(తెలుగు)-12.35, 10.40 కమిటీ కుర్రోళ్ళు(తెలుగు)- 4.00
స్క్రీన్-3	స్త్రీ-2(హిందీ)-9.50,1.05,10.40 ఖేల్ ఖేల్ మెయిన్(హిందీ)- 4.20 తంగలాన్(తెలుగు)-7.20
స్క్రీన్-4	తంగలాన్(తెలుగు)-9.30, 12.50, 4.10, ఆయ్(తెలుగు)-7.30 వేదా(హిందీ)- 10.35
దేవి	కమిటీ కుర్రోళ్ళు - 11.15 , 2.15 ఆయ్ (తెలుగు)-6.15,9.15
నటరాజ్	స్త్రీ-2(హిందీ)
విజయ్	మిస్టర్ బచ్చన్(తెలుగు)
లలితామహల్	డబుల్‌ఇస్మార్ట్(తెలుగు)